సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 22 । జనవరి । 2025



ప్రయాణం సాఫీగా సాగాలని..
జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్, రవాణా శాఖ, ఆర్టీసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. 8లో



నాణ్యమైన భోజనం పెట్టండి
విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ విద్యాచందన ఉపాధ్యాయులకు సూచించారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
34° / 16°
జిల్లాలో బుధవారం ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి పెరుగుతుంది. తెల్లవారుజామున మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా విలాసోత్సవం



విలాసోత్సవంలో పూజలు చేస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం రాత్రి విలాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలోని స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు ఈ వేడుకను వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో తీసుకొచ్చి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం..
శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పామాయిల్ ఫ్యాక్టరీకి నేటి నుంచి సెలవులు

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో బుధవారం నుంచి సెలవులు ప్రకటిస్తున్నట్టు ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పామాయిల్ గెలల దిగుబడి తక్కువగా వస్తున్నందున ఈ సమయంలోనే మరమ్మతు పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. టన్ను బరువు కంటే తక్కువ ఉండే గెలలను అప్పారావుపేట ఫ్యాక్టరీకి, టన్ను కంటే అధిక బరువు గల గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తరలించాలని రైతులను కోరారు.

మార్కెటింగ్ మోసాల బారిన పడొద్దు

ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: ఎక్కువ లాభాలు వస్తాయనే ఆశతో మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో కొందరు పలు రకాల ఉత్పత్తులు, హెర్బల్, హెల్త్ కేర్, ఇతర గృహోపకరణాల మార్కెటింగ్ పేరుతో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని, చైన్ సిస్టమ్ పేరుతో అమాయకులను మోసం చేస్తున్నారని తెలిపారు. విలాసవంతమైన వస్తువులు, విల్లాలు, ఫ్లాట్‌లు ఇస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని రకరకాల ఆఫర్లతో వస్తుంటారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. 'మనకు ఎలాంటి సంబంధం లేనివారు ఏ విధమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చరు' అనే విషయాన్ని ప్రతీ ఒక్కరు గ్రహించాలని కోరారు. సెల్‌ఫోన్‌లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సప్, యూట్యూబ్, ఈ-మెయిల్ వంటి వాటి ద్వారా ఆకర్షించే ప్రయత్నం చేస్తారని, అలాంటి ప్రకటనలను నమ్మొద్దని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా మోసపోతే తక్షణమే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, లేదంటే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా మొదలైన గ్రామ సభలు
- లబ్ధిదారుల ఎంపికపై నిరసనలు, నిలదీతలు
- తొలిరోజు వాడీవేడిగా సాగిన సభలు
- అర్హత ఉన్నా అన్యాయం చేశారంటూ పలువురి ఆవేదన

గ్రామాల్లో గరం..గరం..



ఇల్లెందు మున్సిపాలిటీ సత్యనారాయణపురంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రారంభించిన గ్రామసభలు తొలిరోజు గరం గరంగా సాగాయి. అనర్హులను లబ్ధిదారులుగా గుర్తించారని, ఎన్ని సర్వేలు చేసినా తమకు ఎందుకు న్యాయం జరగడం లేదని అధికారులను పలువురు ప్రశ్నించారు.

నిరసన, నిలదీతలు..
ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను ఈనెల 26 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పలుమార్లు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన చేసిన అధికారులు.. ముసాయిదా జాబితా సిద్ధం చేశారు. చివరగా లబ్ధిదారులను గుర్తించేందుకు మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 169 గ్రామసభలు జరిగాయి. వీటిలో అనేక చోట్ల లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా చేయలేదంటూ అధికారులకు నిరసనలు, నిలదీతలు, అడ్డగింతలు ఎదురయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అనర్హులను లబ్ధిదారులుగా చేర్చారంటూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలోనూ అర్హులను గుర్తించేందుకు ఉపాధి హామీ జాబ్‌కార్డుతో పాటు 2024లో 20 రోజులు పని చేసినట్టు ఉండాలనే నిబంధన సరికాదనే అభిప్రాయం వ్యక్తమైంది. తద్వారా తాము నష్టపోతున్నామని చేతి వృత్తుల వారు, స్వయం ఉపాధి పొందుతున్న భూమిలేని అల్పాదాయ వర్గాల వారు వాపోయారు.

దరఖాస్తు మరో'సారీ'..
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన పేరుతో తొలిసారి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఆ తర్వాత గత అక్టోబర్‌లో చేపట్టిన కులగణనలో వివిధ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి? ఇంకా అందాల్సినవి ఏమున్నాయి.. ఇలా దాదాపు 70కి పైగా అంశాలతో వివరాలు సేకరించారు. డిసెంబర్‌లో యాప్ సర్వే చేపట్టారు. మూడుసార్లు వివిధ పద్ధతుల్లో సర్వే చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినా తుది జాబితాలో తమ పేర్లు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం ఏంటని అధికారులను నిలదీశారు.

ఎంపికల్లో హస్తం మార్క్ !
ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక, రేషన్‌కార్డుల జాబితాలో స్థానిక నేతల 'హస్తం' ముద్ర కనిపించిందనే విమర్శలు చాలా గ్రామాల్లో వచ్చాయి. గతంలో డబుల్ బెడ్ రూమ్ పథకం లబ్ధిదారులుగా ఎంపికైన వారు, ఎకరం, అరెకరం భూమి ఉన్న వారూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలకు లబ్ధిదారులుగా ఎంపికవడానికి రాజకీయ జోక్యమే కారణమనే ఆరోపణలు వచ్చాయి. కేవలం తమ ఆగ్రహాన్ని చల్లార్చేందుకే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం సాగుతుందని, మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెబుతూ అధికారులు కంటితుడుపు చర్యలకు పాల్పడుతున్నారని పలువురు విమర్శించారు.

నిరసనలు, అడ్డగింతలు ఇలా..
- కొత్తగూడెం పట్టణంలోని 1, 5 వార్డులు, చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో పలువురు అధికారులను అడ్డుకున్నారు. పాల్వంచ మండలం పాండురంగాపురం తండాలో ప్రత్యేకాధికారి దేవరాజు తదితరులను స్థానిక మహిళలు అడ్డుకుని చుట్టుముట్టారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పే వరకు వదలమని పట్టుబట్టారు. దంతెలబోరు గ్రామసభలో అధికారులను ప్రజలు నిలదీశారు.
- ఇల్లెందు మున్సిపాలిటీలోని ఒకటో వార్డు, మండల పరిధిలో సీఎస్‌పీ, విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీలు, టేకులపల్లి మండలంలోనూ గ్రామసభలు గందరగోళంగా సాగాయి.
- అశ్వారావుపేట మండలం గుర్రాలచెరువు, కేశప్పగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన, అబ్బుగూడెంలో అధికారులను స్థానికులు నిలదీశారు. ములకలపల్లి మండలం పాత గంగారంలో వలస ఆదివాసీలను లబ్ధిదారులుగా ఎంపిక చేయడంపై స్థానికులు వాగ్వాదానికి దిగారు.
- పినపాక మండలం పోట్లపల్లి గ్రామసభలో అధికారులను ప్రజలు నిలదీశారు.

ఏ ఒక్క పథకమూ రాలేదు



ప్రజాపాలనలో అన్ని పథకాలకు దరఖాస్తు చేసుకున్నా. మొదటి దశలో ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ రాలేదు. ఇప్పుడు ఈ పథకాలకూ ఇంటికొచ్చి సర్వే చేశారు. అయినా ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు కాలేదు. ఇదేంటని అడిగితే అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకొమ్మంటున్నారు.
– మాలోతు లాలి, ఎన్‌కే నగర్, చుంచుపల్లి మండలం

లిస్టులో పేరు వచ్చినా..



నాకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేస్తూ ముందు సమాచారం ఇచ్చారు. తీరా గ్రామసభకు వచ్చాక నా భర్త పేరున 9 గుంటల భూమి ఉందని, పథకం వర్తించదని అభ్యంతరం పెట్టారు. జాబ్‌కార్డులో ఆయన పేరు లేదు కాబట్టి నాకు వచ్చినా పలువురు అభ్యంతరం చెప్పారు.
– బాదావత్ చిట్టెమ్మ, ఎన్‌కే నగర్, చుంచుపల్లి మండలం

అర్హత ఉన్నా పేరు లేదు



వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాం. ప్రస్తుతం చిన్న రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నాం. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేస్తే గ్రామ కార్యదర్శి వచ్చి ఫొటో తీసుకున్నారు. అయినా ఇప్పుడు అధికారులు ప్రకటించిన జాబితాలో నా పేరు లేదు. ఇదేంటని అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు.
– బోడ కోటేశ్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, టేకులపల్లి మండలం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- జాబితాలో పేరు లేదని ఆందోళన చెందొద్దు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక.. ఇది నిరంతర ప్రక్రియ
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చండ్రుగొండ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలు అర్హులందరికీ వస్తాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని మద్దుకూరులో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత జాబితాలో పేరు లేనంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందన్నారు. జాబితాలో పేరు లేనివారు తిరిగి పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సంక్షేమ పథకాల కోసం పైరవీకారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతుభరోసా పథకానికి ఆమోదయోగ్యం కాని భూములను ఇప్పటికే గుర్తించామని, వాటికి ఆర్థిక సాయం అందకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వలస గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పోడు భూములకు ఇప్పటికే పట్టాలు ఇచ్చినందున మళ్లీ కొత్తగా పోడు నరకవద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫిర్యాదులపై విచారణ..
మండలంలోని రెండు గ్రామాల వారు తమకు జరిగిన అన్యాయంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిసి ఇటీవల చేసుకున్న ఫిర్యాదులపై కలెక్టర్ విచారణ జరిపారు. బాల్యాతండాలో బోరుబావి విషయమై రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదంపై ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు. బెండాలపాడులో నాలుగేళ్ల క్రితం మిర్చి కొనుగోలు చేసిన వ్యాపారి నేటికీ డబ్బులు ఇవ్వలేదన్న ఫిర్యాదుపై తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో, వ్యాపారితో నేరుగా మాట్లాడి విచారణ జరిపారు. కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ విద్యాచందన, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రిపబ్లిక్ వేడుకల విజయవంతానికి కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వేదికతో పాటు విద్యాశాఖ ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, సౌండ్ ప్రూఫ్ జనరేటర్ అందుబాటులో ఉంచాలని, బారికేడ్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రామయ్య భూముల రక్షణకు కృషి

ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ.శంకర్‌రావు



పర్ణశాల నారచీరల ప్రాంతం వద్ద ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు

భద్రాచలంటౌన్/దుమ్ముగూడెం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి సంబంధించిన భూముల ఆక్రమణ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి రక్షణకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ.శంకర్‌రావు వెల్లడించారు. మంగళవారం ఆయన భద్రాచలం రామాలయానికి రాగా అర్చకులు స్వాగతం పలికి స్వామి దర్శనం, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఏపీలోని పురుషోత్తపట్నంలో గల ఆలయ భూముల ఆక్రమణలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు కోరగా సత్వరమే పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని శంకర్‌రావు చెప్పారు. ఆ తర్వాత దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో కూడా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని శంకర్ రావు దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కొర్ర రామలక్ష్మి, వడిత్య శంకర్‌నాయక్, లిల్లీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

ఇల్లెందురూరల్: ప్రతీ విద్యార్థి ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. మండలంలోని సుదిమళ్ల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ, విద్యా బోధన ఎలా ఉన్నాయి.. మార్కులెలా వస్తున్నాయంటూ ఆరా తీశారు. వంట గదులను పరిశీలించి పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని సిబ్బందిని ఆదేశించారు. నాణ్యమైన కూరగాయలు, వంట సామగ్రిని వినియోగించాలన్నారు. ఆయన వెంట ఆర్‌సీఓ నాగార్జున్‌రావు, ఏటీడీఓ రాధమ్మ, గిరిజన సంక్షేమ ఈఈ చంద్రశేఖర్, ఏఈ సాలార్, రాజు, ప్రిన్సిపాల్ మాధవి, రత్నకుమారి ఉన్నారు.

గ్రంథాలయం తనిఖీ..
ఇల్లెందు: పట్టణంలోని జేకే వద్ద ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్న గ్రంథాలయాన్ని పీఓ పరిశీలించారు. వసతి సదుపాయాలపై పలు సలహాలు సూచనలు చేశారు. పుస్తకాలు ర్యాక్‌ల్లో క్రమపద్ధతిన అమర్చాలని, నిరుద్యోగులకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పాఠకులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

వసూళ్లు అంతంతే!

- మందకొడిగా సాగుతున్న ఇంటి పన్నుల ప్రక్రియ
- జిల్లాలో 40.69 శాతం మాత్రమే కలెక్షన్
- వివిధ సర్వే పనుల్లో బిజీబిజీగా కార్యదర్శులు
- మరో 70 రోజుల్లో లక్ష్యం చేరేనా..?




రుద్రంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: పల్లెల అభివృద్ధిలో ఇంటి పన్నులే ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తుంటాయి. అయితే ఈ ఏడాది గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె ప్రగతి ద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధికి బాటలు వేసేందుకు జిల్లాకు నెలకు రూ.9.38 కోట్ల మేర ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుండగా ఆయా గ్రామాల్లోని ప్రధాన సమస్యలు పరిష్కరిస్తున్నారు. వీటితో పాటు ఇంటి పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీల్లో పాలన మెరుగుపడుతోంది. అయితే ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సకాలంలో రాకపోవడంతో పల్లెలు పలు సమస్యలతో సతమతం అవుతున్నాయి. ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, చిన్న చిన్న మరమ్మతులకు సైతం పంచాయతీ కార్యదర్శులే ముందు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నుల వసూళ్లు కూడా అంతంతగానే ఉన్నాయి. ఇటీవలి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం పలు సర్వేల పేరుతో కార్యదర్శులకు అదనపు బాధ్యతలను అప్పగించడంతో వారు ఇంటిపన్నుల వసూళ్లపై అంతగా దృష్టి సారించలేకపోతున్నారు. పన్నుల వసూళ్లకు మరో 70 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉండడంతో మిగతా బకాయిలపై దృష్టి సారించాల్సి అవసరం ఉంది.

ఇప్పటివరకు 40.69 శాతమే..
జిల్లాలో 481 గ్రామ పంచాయతీలున్నాయి. భద్రాచలం డివిజన్‌లో 8, కొత్తగూడెం డివిజన్‌లో 14 మండలాలు ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా పన్నుల ద్వారా ఆదాయం వచ్చే వాటిలో భద్రాచలం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలు ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో రూ.14,95,35,840 పన్నులు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.6,08,39,209 మాత్రమే వసూలయ్యాయి. అంటే మొత్తంగా 40.69 శాతం మేర మాత్రమే వసూలు చేశారు. ఇందులో అత్యధికంగా టేకులపల్లి, ఆళ్లపల్లి మండలాల్లో 91.31 శాతం వసూలు కాగా, అత్యల్పంగా భద్రాచలంలో 10 శాతం, అశ్వారావుపేటలో 27 శాతం, చుంచుపల్లిలో 33 శాతం, మణుగూరులో 42 శాతం మాత్రమే వసూలు చేశారు. మరో 70 రోజుల్లో వంద శాతం వసూలు చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీలు ఇంటి పన్ను, సంతలు, లైసెన్సులు, బంజరుదొడ్డి తదితర వాటిపై ఏటా ప్రణాళిక ప్రకారం వంద శాతం పన్ను వసూలు చేయాలి. వచ్చిన నగదును కార్యాలయంలో జమ చేసి గ్రామ పంచాయతీ అవసరాలు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, గ్రామసభల ఏర్పాటుకు ఖర్చు చేస్తారు. మరో నెల రోజుల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైతే కార్యదర్శులు ఆ పనికే సమయం సమయం కేటాయించాల్సి వస్తుంది. దీంతో ఈలోపే వందశాతం ఇంటి పన్నుల వసూళ్లపై సిబ్బంది దృష్టి సారిస్తే ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది.

వసూళ్లు వేగవంతం చేస్తాం



జిల్లాలో ఇంటిపన్నుల వసూళ్ల ప్రక్రియ కొంత మందకొడిగానే సాగుతోంది. ప్రభుత్వం కేటాయించిన వివిధ రకాల పనుల్లో సిబ్బంది నిమగ్నం కావడం కూడా దీనికి ఒక కారణమే. గ్రామ కార్యదర్శులు దాదాపు రెండు నెలలుగా వివిధ సర్వే పనులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 40.69 శాతం మేర పన్నులు వసూలయ్యాయి. మిగతా వసూళ్లు కూడా వేగవంతం చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధిస్తాం.
– చంద్రమౌళి, డీపీఓ

మండలాల వారీగా ఇంటిపన్నుల వసూళ్ల వివరాలు (రూ.లలో)

మండలం	లక్ష్యం	వసూలు	శాతం	మండలం	లక్ష్యం	వసూలు	శాతం
ఆళ్లపల్లి	4,08,590	3,71,913	91.02	గుండాల	6,78,450	5,29,814	78.09
అన్నపురెడ్డిపల్లి	14,88,359	7,45,102	50.06	జూలూరుపాడు	23,34,365	13,18,555	56.48
అశ్వాపురం	55,71,393	29,92,231	53.71	కరకగూడెం	11,19,188	6,60,976	59.06
అశ్వారావుపేట	1,13,75,212	30,61,497	26.91	లక్ష్మీదేవిపల్లి	1,35,45,478	69,74,734	51.49
భద్రాచలం	3,51,69,614	35,73,496	10.16	మణుగూరు	61,98,876	26,28,431	42.40
బూర్గంపాడు	1,22,59,124	66,94,822	54.61	ములకలపల్లి	22,40,774	11,73,983	52.39
చండ్రుగొండ	25,54,607	15,90,111	62.24	పాల్వంచ	48,92,762	25,18,307	51.47
చర్ల	65,95,804	34,43,060	52.20	పినపాక	31,49,160	15,33,865	48.71
చుంచుపల్లి	1,71,15,284	58,04,970	33.92	సుజాతనగర్	54,28,802	31,64,666	58.29
దమ్మపేట	62,73,053	40,23,378	64.14	టేకులపల్లి	29,52,661	26,96,105	91.31
దుమ్ముగూడెం	52,85,568	38,07,442	72.03	ఇల్లెందు	28,98,716	15,31,751	52.84

ఆర్టీసీకి సం'క్రాంతి'

- 12 రోజుల్లో రూ.20.73 కోట్ల ఆదాయం
- సంస్థకు కలిసొచ్చిన పండుగ సర్వీసులు
- రీజియన్‌లో 25.80 లక్షల మంది ప్రయాణం

ఖమ్మంమయూరిసెంటర్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ ఖమ్మం రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపించింది. ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకు షెడ్యూల్ సర్వీసులకు తోడు అదనపు సర్వీసులు తిప్పడంతో సంస్థకు భారీగా ఆదాయం నమోదైంది. పండుగకు వారం రోజులే కాక ఆ తర్వాత వారాంతపు సెలవులు కలిసి రావడంతో 20వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులు కొనసాగాయి. ఈ బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేయగా సంస్థకు భారీగానే లాభాలు వచ్చాయి. మొత్తం 12 రోజుల్లో ఏడు డిపోల పరిధిలో 25.80 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించగా రూ.20.73 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

1,277 బస్సులు
ఈనెల 11నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభం కాగా.. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ 9వ తేదీ నుంచే ప్రత్యేక బస్సులు నడిపింది. 9 నుంచి 14వ తేదీ వరకు వరకు హైదరాబాద్ నుంచి మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ప్రాంతాలకు, ఇక 15 నుంచి 20వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు సర్వీసులు ఏర్పాటుచేశారు. షెడ్యూల్ ప్రకారం నడిచే బస్సులు కాకుండా అదనంగా 1,277 బస్సులను నడిపించడం విశేషం.

30.96 లక్షల కిలోమీటర్లు..
సెలవుల్లో ఆర్టీసీ అధికారులు ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాకు మొత్తం 30.96 లక్షల కి.మీ. మేర బస్సులు తిప్పారు. 25.80 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించడంతో ఆర్టీసీకి రూ.20.73 కోట్ల ఆదాయం సమకూరింది. రీజియన్‌లో 104 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) నమోదవగా, మహాలక్ష్మి పథకం ద్వారా 15.97 లక్షల మంది మహిళలు ప్రయాణించారు. కాగా, హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాకు ఈనెల 11న, తిరుగు ప్రయాణంలో ఈనెల 19న అత్యధికంగా రూ.2.34 లక్షల మంది ప్రయాణం సాగించారు. దీంతో ఆ రెండు రోజుల్లో రెగ్యులర్, స్పెషల్ సర్వీసులే కాక 79 చొప్పున అదనపు బస్సులు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. సంక్రాంతి పండుగకు ఉమ్మడి జిల్లా ప్రజలే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కూడా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల మీదుగా తమ స్వస్థలాలకు వెళ్లారు. ఫలితంగా సత్తుపల్లి డిపోకు అత్యధికంగా 150 రిజర్వేషన్ బస్సులు నడిపించారు.

డిపోల వారీగా 12 రోజుల్లో ప్రయాణికులు, ఆదాయ వివరాలు

డిపో	ప్రయాణికులు (లక్షల్లో)	ఆదాయం (రూ.ల్లో)	కిలోమీటర్లు (లక్షల్లో)	ఓఆర్
ఖమ్మం	5.41	4,86,69,000	7.57	100.89
మధిర	1.29	2,29,47,000	3.34	109.89
సత్తుపల్లి	6.12	3,73,25,000	5.49	106.16
భద్రాచలం	3.44	3,99,05,000	6.02	100.73
కొత్తగూడెం	3.35	2,22,60,000	3.22	107.89
మణుగూరు	4.16	3,02,32,000	4.30	108.92
ఇల్లెందు	0.99	60,10,000	1.01	105.46

క్లుప్తంగా

ఆధ్యాత్మికవేత్తకు పురస్కారం


అవార్డు అందుకుంటున్న సురేశ్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మధురబస్తీకి చెందిన ఆధ్యాత్మిక వేత్త కొచ్చర్ల సురేశ్‌కు జాతీయ ప్రతిభ పురస్కారం లభించింది. మంగళవారం ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా విజయవాడలో తెలుగు కీర్తి అవార్డులు అందించగా.. తనకు కూడా పురస్కారాన్ని అందజేశారని సురేశ్ తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 22, 23 తేదీల్లో రెండు రోజులపాటు జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 22వ తేదీన క్రీడలు, వ్యక్తిగత ఈవెంట్లు ఉంటాయని, 23న విజేతలకు బహుమతి ప్రదానం, ప్రశంసాపత్రాలు అందిస్తామని వివరించారు.

నేడు భద్రాచలంలో వర్క్‌షాపు

కొత్తగూడెంఅర్బన్: నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో బుధవారం భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో ఎంపిక చేసిన 50 పాఠశాలల విద్యార్థినులకు ఒక్కరోజు వర్క్‌షాపు ఏర్పాటు చేసినట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఎకో –ఫ్రెండ్లీ సబ్బు తయారీ, హ్యాండ్‌వాష్, డిష్‌వాష్ ద్రవాల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 150 మంది బాలికలు, 50 మంది ఉపాధ్యాయులు హాజరు కానున్నరని తెలిపారు. ఎంపిక చేసిన పాఠశాలల వివరాలు ఇప్పటికే హెచ్‌ఎంలు, ఎంఈఓ గ్రూపుల్లో పెట్టామని, విద్యార్థులు వారి వెంట పాఠశాల రౌండ్ స్టాంప్ తీసుకురావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హాజరయ్యే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు, సెల్: 9247296012 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తొమ్మిది మంది బైండోవర్


సారా తయారీ, విక్రయదారులను తహసీల్దార్ స్వాతిబిందు ఎదుట హాజరు పరిచిన దృశ్యం

జూలూరుపాడు: తొమ్మిది మంది నాటుసారా తయారీదారులు, విక్రయదారులు, బెల్లం, పటిక విక్రయదారుడిని మంగళవారం ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ చేశారు. ఇటీవల పలు గ్రామాలకు చెందిన నాటుసారా తయారీదారులు, అమ్మకందారులు, బెల్లం, పటిక విక్రయదారులను కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారిని మంగళవారం జూలూరుపాడు తహసీల్దార్ స్వాతిబిందు ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆర్టిజన్ ఆత్మహత్య

పాల్వంచ: కేటీపీఎస్‌కు బొగ్గు సరఫరా చేసే రైలుకింద పడి ఆర్టిజన్ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మంగళవారం కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలో బాయిలర్‌లో విధులు నిర్వహించే ఆర్టిజన్ కార్మికుడు పులికంటి మనోహర్ (42) విధులకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి పట్టణ పరిధిలోని బంజరాకాలనీ సమీపంలో రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైలు మెడపై నుంచి వెళ్లడంతో తల, మొండెం వేరయ్యాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సులోచన, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు.

ఐదు బస్తాల మిర్చి చోరీ

తల్లాడ: తల్లాడలో సోమవారం రాత్రి ఓ రైతుకు చెందిన మిర్చి బస్తాలు చోరీకి గురయ్యాయి. రైతు దగ్గుల శ్రీనివాసరెడ్డి రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేయగా మొదటి కోతగా వచ్చిన ఐదు బస్తాల పండు మిర్చిని తోట వద్దే నిల్వ చేశాడు. అయితే, మంగళవారం చూసే సరికి మిర్చి లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈమేరకు రైతుల ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

ప్రయాణం సాఫీగా సాగాలని..

- రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- కొనసాగుతున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు
- ఏడాది కాలంలో జిల్లాలో 491 రోడ్డు ప్రమాదాలు.. 220 మంది మృతి
- 11 వేలకు పైగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు


రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా భద్రాచలం బైక్ ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, ఎంవీఐ, ఆర్టీసీ డిపో మేనేజర్ తదితరులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ఏటా రోడ్డు ప్రమాదాలు పెరగడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. అతివేగం, మద్యం తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ, రహదారి భద్రతా నియమాలు పాటించకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏటా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తూ ప్రమాదాలను నివారించేందుకు ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. 38వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్, రవాణాశాఖ, ఆర్టీసీ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాలు, పట్టణాలు ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో ఆటో, స్కూల్ బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రమాదాల్లో యువతే..

మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల్లో మరణించే వారిలో ఎక్కువ సంఖ్యలో యువకులే ఉండటం కలిచివేసే అంశం. బైక్‌లపై వెళ్లే సమయంలో హెల్మెట్ విధిగా ధరించేలా చూడాలి. వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్లో మాట్లాడితే మరింత కఠిన చర్యలు తీసుకోవాలి. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలుశిక్షతో పాటు లైసెన్సులు రద్దు చేయాలి. ట్రాఫిక్ నియమాలు, సరైన లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపిన వారిని కఠినంగా శిక్షించాలి. మైనర్లు బైక్‌లు నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. జిల్లాలో గతేడాది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 11,878 కేసులు నమోదు చేశారు. వీటిలో 9068 కేసులు కోర్టులో ఫైన్ విధించగా, 23 మందికి జైలు శిక్ష పడగా, 20 మందికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సులు సస్పెండ్ చేశారు. ఏడాది కాలంలో 491 రోడ్డు ప్రమాదాలు జరగగా అందులో 220 మంది మృతి చెందారు. 224 మంది గాయపడ్డారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ (ఫైల్)

జరిమానాల విధింపు..

మద్యం తాగి వాహనాలు నడిపించినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా, పరిమితి సంఖ్యకు మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించుకున్నా, హెల్మెట్ ధరించకున్నా, సీటు బెల్టు లేకున్నా చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. 2022లో 515 ప్రమాదాల్లో 215 మంది, 2023లో 515 ప్రమాదాల్లో 226 మంది మృత్యువాత పడ్డారు. ప్రతి ఏడాది మృతుల సంఖ్య పెరుగుతూనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



రోడ్డు భద్రత అందరి బాధ్యత. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి. తద్వార ప్రాణాలు కాపాడుకోవచ్చు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలి. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు. రోడ్డుపై ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు చూసి జాగ్రత్తగా వాహనం నడపాలి.

– వెంకట పుల్లయ్య, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, భద్రాచలం

నియమాలు, నిబంధనలు పాటించాలి



రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రమాదాలతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించి ప్రజల్లో చైతన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

–విక్రాంత్ కుమార్ సింగ్, భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ

అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కేటీపీఎస్ కాంప్లెక్స్ సీఈలు

పాల్వంచ: పట్టణంలోని విద్యుత్ కళాభారతి క్రీడా మైదానంలో కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న టీజీ జెన్‌కో స్థాయి ఇంటర్ ప్రాజెక్ట్స్ హాకీ, బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు కేటీపీఎస్, బీటీపీఎస్, భూపాలపల్లి, పులిచింతల, పోచంపాడు క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీపీఎస్ 5, 6, 7 దశల సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు, జెన్‌కో ట్రెనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు మాట్లాడారు. క్రీడాకారులు జాతీయస్థాయిలో సత్తా చాటాలన్నారు. ఉద్యోగులు నిత్యం విధి నిర్వహణలో ఎంతో మానసిక ఒత్తిడికి లోనవుతుంటారని, క్రీడల వల్ల మానసికోల్లాసం, శారీరక దృఢత్వం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ డిప్యూటీ సెక్రటరీ లోహిత్ ఆనంద్, ఎస్‌ఈలు మోక్షవీర్, వెంకటేశ్వరరావు, ఈఈ ముత్తయ్య, స్పోర్ట్స్ సెక్రటరీ వీరస్వామి, మహేశ్, స్పోర్ట్స్ ట్రెజరర్ వైటీఎంకే రాజు, కట్టా శ్రీధర్, రిఫరీలు ఇలియాజ్, ఆరీఫ్, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, బూర్గుల విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం


నాగేశ్వరమ్మ (ఫైల్)

దమ్మపేట: వృద్ధురాలు కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన గండికోట లక్ష్మణ్‌రావు తల్లి నాగేశ్వరమ్మ (75) ఈ నెల 18న రాత్రి తన గది నుంచి వెళ్లిపోయింది. తెల్లవారుజామున ఆమె కనిపించకపోవడంతో కుమారుడు లక్ష్మణ్‌రావు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. లక్ష్మణ్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

సీజ్ చేసిన ట్రాక్టర్ మాయం


తహసీల్దాల్ కార్యాలయంలో ఉంచిన ట్రాక్టర్ (ఫైల్)

ములకలపల్లి: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. కానీ, ఆ ట్రాక్టర్ కనిపించకుండా పోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మూకమామిడి శివారులోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు శుక్రవారం రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దాడి చేసి, ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తోలుతున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇదిలా ఉండగా సీజ్ చేసిన ట్రాక్టర్‌ను కొందరు వ్యక్తులు తరలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ గుడ్ల పుల్లారావును వివరణ కోరగా.. ట్రాక్టర్ మాయమైన విషయం నిజమేనని స్పష్టం చేశారు. ఈ విషయమై పోలిస్ స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అదుపుతప్పిన ద్విచక్రవాహనం

అంగన్‌వాడీ టీచర్‌కు తీవ్ర గాయాలు


భారతమ్మను పరామర్శిస్తున్న సీడీపీఓ, సూపర్‌వైజర్లు


టేకులపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో అంగన్‌వాడీ టీచర్‌కు తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఆళ్లపల్లి మండలం రామానుజగూడెం పంచాయతీ ఇప్పనపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గొగ్గల భారతమ్మ మంగళవారం తన తమ్ముడితో కలిసి బైక్‌పై టేకులపల్లికి వచ్చింది. తిరిగి స్వగ్రామానికి అదే బైక్‌పై వెళ్తుండగా మంగళితండా సమీపంలో అదుపుతప్పింది. వెనకాల కూర్చున్న భారతమ్మ ఎగిరి రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కె.ఎం.తార, సూపర్‌వైజర్లు విజయకుమారి, లక్ష్మి ఆస్పత్రికి వెళ్లి భారతమ్మను పరామర్శించారు.

రైతులతో కలిసి ఉద్యమిస్తాం..


సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

చింతకాని: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతులతో కలిసి ఉద్యమాలు చేపడుతామని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు వెల్లడించారు. చింతకాని మండలం కొదుమూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకరావాలని 54 రోజులుగా ఢిల్లీలో రైతు సంఘం నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ దీక్ష చేస్తున్నా కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అలాగే, రాష్ట్రప్రభుత్వం సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని తెలిపారు. ఇకనైనా సబ్సిడీపై వ్యవసాయానికి పరికరాలు అందజేయడమే కాక వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని, అర్హులందరికి ఇందిరమ్మ ఆత్మీయ భరో సా పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కూచి పూడి రవి, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, నక్కనబోయిన సుజాత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంప్‌లో పడి వ్యక్తి మృతి


పుల్లారావు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: కూలికి వెళ్లిన వ్యక్తికి ఫిట్స్ రావడంతో సంప్‌లో పడగా మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలోని ఓ వ్యక్తి ఇంట్లో నీటి సంప్ శుభ్రం చేయడానికి పెనుబల్లి మండలం టేకులపల్లికి చెందిన గోళ్లమండల పుల్లారావు (42) మంగళవారం వచ్చాడు. నీళ్లు తోడుతుండగా ఆయనకు ఫిట్స్ రావడంతో అందులో పడిపోయాడు. కాసేపయ్యాక గమనించిన స్థానికులు పుల్లారావునుబయటకు తీసి సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్యతో పాటు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఆరు నెలల పసికందుతో భార్య రాణి, పుల్లారావు తల్లి తదితరులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

మెడికల్ బోర్డుకు 47 మంది గైర్హాజరు



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో నిర్వహిస్తున్న మెడికల్ బోర్డుకు మంగళవారం 47 మంది గైర్హాజరయ్యారు. సింగరేణి వ్యాప్తంగా గల 11 ఏరియాల నుంచి 210 మందిని మెడికల్ బోర్డుకు ఆహ్వానించగా వారిలో 163 మంది మాత్రమే హాజరయ్యారు. వారికి బోర్డు అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అనారోగ్యంతో బాధపడేవారిని బుధవారం అన్‌ఫిట్ చేయనున్నారు. కాగా, నేడు కూడా మెడికల్ బోర్డు కొనసాగనుంది.

మద్యం మత్తులో మహిళపై దాడి

ఇల్లెందు: మద్యం మత్తులో మహిళపై దాడి చేసిన ఘటనలో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్‌బీఎస్‌నగర్‌కు చెందిన ఆవుల రాజారమణికి వరుసకు బావ అయ్యే సింగరేణి ఉద్యోగి లక్ష్మణ్ మద్యం మత్తులో ఆమె ఇంటికి వచ్చాడు. తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చేయడంతోపాటు ఆమెపై దాడి చేశాడు. ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశాడు. రాజారమణి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరాఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఊట్లపల్లి వద్ద పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్‌కు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ యయాతిరాజు తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

దమ్మపేట: బైక్ ఢీకొని రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి గాయనపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుర్వాయిగూడెం గ్రామానికి చెందిన కుంజా పోతురాజు ప్రభుత్వ పశు వైద్యశాలకు సమీపంలోని రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. మందలపల్లి నుంచి దమ్మపేట వైపునకు బైక్‌పై వస్తున్న కంచర్ల పుల్లారావు పోతురాజును ఢీకొట్టాడు. పోతురాజు కాలి ఎముక విరిగిపోగా స్థానిక ఆస్పత్రికి.. అక్కడి నుంచి పాల్వంచకు తరలించారు.

కారు డ్రైవర్‌పై కేసు

పాల్వంచరూరల్: వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడగా.. కారుడ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని సోములగూడెం గ్రామానికి చెందిన బీరంశెట్టి కృష్ణ భద్రాచలం వెళ్లి తిరిగి పాల్వంచకు ద్విచక్రవాహనంపై వస్తుండగా రంగాపురం సమీపంలో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణకు తీవ్రగాయాలు కాగా.. బాధితుడి బంధువు పొల్లూరి భానుతేజ ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన కారుడ్రైవర్ శివకృష్ణపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టండి

అదనపు కలెక్టర్ విద్యాచందన


విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

చంద్రుగొండ : విద్యార్థినులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యాబోధన సక్రమంగా జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ విద్యాచందన సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. బాలికల హాజరుశాతాన్ని, బియ్యం, కూరగాయలను పరిశీలించి వంటకాలు రుచి చూశారు. ఆమె వెంట ఎంపీడీఓ బయ్యారపు అశోక్, విద్యాలయం ప్రత్యేకాధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తాం..

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. మండలంలోని అబ్బుగూడెం, తొట్టిపంపు, భీమునిగూడెం పంచాయతీల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలను ఆమె పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబితాలో పేరు లేదని ఆందోళన వద్దన్నారు. అర్హులై ఉండి జాబితాలో పేరు లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అబ్బుగూడెంలో రసాభాస...

మండలంలోని అబ్బుగూడెంలో గ్రామసభ రసాభాసగా మారింది. సంక్షేమ పథకాల జాబితాలో అర్హుల పేర్లు లేవని, జాబితా తప్పులతడకగా ఉందని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికారులను నిలదీస్తూ వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆందోళనకారులతో మాట్లాడి సర్దిచెప్పారు. గ్రామసభల్లో స్పెషల్ ఆఫీసర్ మహ్మద్ షర్ఫుద్దీన్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబ్బీం, ఆర్‌ఐ మధు పాల్గొన్నారు.

యూరియా ఇవ్వడం లేదని ఆందోళన

రైతులకు మద్దతుగా రాజీనామా చేసిన డైరెక్టర్లు


పీఏసీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, డైరెక్టర్లు

బోనకల్: బోనకల్ మండలం రావినూతల సొసైటీ పరిధిలో రైతులకు యూరియా ఇవ్వడం లేదని ఆళ్లపాడుకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. సొసైటీ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళనకు డైరెక్టర్లు కూడా మద్దతు తెలిపారు. సొసైటీ పరిధిలో రావినూతల, ఆళ్లపాడు గ్రామాలు ఉండగా రావినూతల రైతులకే యూరియా ఇచ్చి తమకు ఇవ్వడం లేదని ఆళ్లపాడు రైతులు వాపోయారు. సొసైటీ చైర్మన్, సీఈఓ ఏకపక్ష వైఖరితో ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈమేరకు సీఈఓ రాంబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ గ్రామానికి ఎంత యూరియా ఇచ్చారో రికార్డులు చూపించాలని పట్టుబట్టారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కాగా, సొసైటీ చైర్మన్ మైనేని నారాయణ, సీఈఓ రాంబాబు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఆళ్లపాడుకు చెందిన డైరెక్టర్లు తోటకూర వెంకటేశ్వరావు, చెన్నకేశ పెద్దవెంకయ్య, వెంకట్రాములు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మందా రామారావు, బుంగా నరేష్, షేక్ పెంటసాహెబ్, ధనమూర్తి, పారా వెంకటమోహన్, ప్రసాద్, మల్లాది లింగయ్య పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి..

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు షేక్ రజాక్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్‌ఎస్, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీసం వేతనం ఇవ్వడమే కాక పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జూలై 2023 నుండి పీఆర్సీ అమలు చేయాలన్నారు. అలాగే, రిటైర్మెంట్ వయసు పెంచాలనే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవానితో పాటు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, ఎల్లయ్య, రవికుమార్, నరసింహారావు, సురేష్ పాల్గొన్నారు. కాగా, రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ గురుకులాల్లో ఉపాధ్యాయులకు పని ఒత్తిడి ఉండడమే కాక మిగతా వారితో పోలిస్తే ఎక్కువ పనిగంటలు ఉండడంతో అనారోగ్యం బారిన పడుతున్నందున హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగమల్లేశ్వర్, లివింగ్‌స్టన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడండి


టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీఎన్జీవోస్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ జిల్లా నూతన కమిటీ బాధ్యులు హైదరాబాద్‌లో మంగళవారం టీఎన్జీవోస్ కేంద్ర సంఘం, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాసరావును కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ అభినందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఎస్.జైపాల్, కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, యాకూబ్‌పాషా, ఏలూరి హరికృష్ణ, పెద్దినేని రాధాకృష్ణ, ఎర్రమళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

తల్లాడ: తల్లాడ మండలంలోని అన్నారుగూడెంలో మంగళవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఎస్‌ఐ బి.కొండల్‌రావు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా అన్నారుగూడెం మొక్క పోచమ్మ ఆలయం గుట్టల సమీపాన పేకాట ఆడుతూ ఆరుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.65 వేలు నగదు, ఆరు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే, తల్లాడలోని ఓ ఇంట్లో తనిఖీ చేసిన పోలీసులు పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 12,660 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.